www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 24 మే 2024
5



కవులకు కాణాచి కడప జిల్లా

ప్రజాశక్తి కడప అర్బన్


కవులకు కాణాచి కడప జిల్లా అని, మన జిల్లాలో ఎంతో మంది కవులు, కళాకారులున్నారని కడప జిల్లా పెన్షన్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నాగ మునిరెడ్డి, రామ్మూర్తి నాయుడు అన్నారు. గురువారం పద కవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 614 వ జయంతి సందర్భంగా సంఘం కార్యాలయంలో అన్నమయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య పాడిన కీర్తనలు ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ఆయన మన జిల్లాలో జన్మించడం మన అదృష్టమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసులు, ట్రెజరర్ నగేష్, సభ్యులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, గోపాల్ రెడ్డి, నాగయ్య, బాల సుబ్రహ్మణ్యం, నారాయణ, బాష, శంకరయ్య, రాయుడు, కరీముల్లా పాల్గొన్నారు.

ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలకు

కసరత్తు

- అసంపూర్తిగానే పులివెందుల, మదనపల్లి కళాశాలలు
- నేషనల్ మెడికల్ కౌన్సిల్ సిఫారసు కోసం నిరీక్షణ
- సెప్టెంబర్‌లో తరగతుల నిర్వహణ దిశగా చర్యలు
- ఎంఎన్‌సికి ప్రభుత్వ లేఖపై ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని పులివెందుల, మదనపల్లి నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల కార్యకలాపాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఒక వైపు పూర్తి స్థాయిలో నిర్మాణానికి నోచని వైద్య కళాశాలల భవనాలు, మిషనరీ, ల్యాబ్స్, మరోవైపు అరకొర ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది నియామకాల గందరగోళంపై సందిగ్ధత నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ముంగిట ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పులివెందుల మెడికల్ కళాశాలను ప్రారంభం చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మెడికల్ కళాశాలల అడ్మిషన్లకు అనుమతి తెలపాలని కోరుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాసిన నేపథ్యంలో కథనం...



పులివెందుల మెడికల్ కళాశాల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లోని పులివెందుల, మదనపల్లి వైద్య కళాశాలల కార్యకలాపాల నిర్వహణకు కసరత్తు ఊపందుకుంది. 2019లో రూ.450 కోట్లతో పులివెందుల, రూ.వందల కోట్లతో మదనపల్లి వైద్య కళాశాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అనంతరం కరోనా విజృంభణతో వైద్య కళాశాల పనులు నిలిచిపోయాయి. కరోనా అనంతరం మూడేళ్లలో భవన నిర్మాణ పనుల్ని సుమారుగా పూర్తి చేయడం గమనార్హం. మొదటి సంవత్సర అడ్మిషన్లను దృష్టిలో ఉంచుకుని 90 శాతం మేరకు వైద్య కళాశాలల పనులు పూర్తి చేశారు. మిగిలిన పెండింగ్ పనుల్ని మరో రెండు ఫేజుల్లో పూర్తి చేయడంపై వైద్యకళాశాలల అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

రిక్రూట్‌మెంట్ అరకొరే!

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రమాణాల మేరకు తరగతి గదులు, ఒటి, ల్యాబ్స్, లైబ్రరీ వంటి ఇతర సదుపాయాలను కలిగి ఉండాలి. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు కావడంతో ఎన్ఎంసి ప్రమాణాలను కలిగి ఉంటాయని చెప్పవచ్చు. వైద్యకళాశాలకు అవసర మైన మేరకు ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది నియామకాలను చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి వైద్య కళాశాలకు 222 మంది ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది కావాల్సి ఉండగా 98 మంది మాత్రమే నియామకం చేయడం గమనార్హం. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 మంది ఫ్యాకల్టీని నియమించింది. మిగిలిన 72 మంది బోధనేతర సిబ్బంది నియామకంలో గందరగోళం నెలకొనడంతో వెర్ఫికేషన్ పేరుతో కాలయాపన కొనసాగుతోంది.

కొనసాగుతున్న వెర్ఫికేషన్!

సార్వత్రిక ఎన్నికల ముంగిట కడప, పులివెందుల మెడికల్ కళాశాలలకు సంబంధించి 198 మంది సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. రిక్రూట్‌మెంట్ చేయడంలో అనుభవజ్ఞుల సేవలు కొరవడిన నేపథ్యంలో ఫైనల్ లిస్టును విడుదల చేయడంలో గందరగోళం నెలకొంది. ఫలితంగా డిప్యూటీ సిఎం ఎస్‌బి.అంజాద్‌బాషా జోక్యం చేసుకోవడంతో కలెక్టర్ స్పందించి నలుగురు ప్రభుత్వ ఉన్నతాధికారుల పర్యవేక్షణతో వెర్ఫికేషన్ చేయించడం ఆందోళన కలిగిస్తోంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో వెరిఫికేషన్ తంత్రం సాగుతూనే ఉండడం గమనార్హం.

ఎన్ఎంసి తనిఖీ కోసం నిరీక్షణ

పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల కార్యకలాపాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 15 రోజుల కిందటే ఎన్ఎంసి పరిశీలన చేయాల్సి ఉంది. ప్రభుత్వం నూతన వైద్య కళాశాలల అడ్మిషన్లకు ఆమోదం తెలపాలని కోరుతూ లేఖ రాసింది. నెలాఖరులోపు ఎన్ఎంసి ఇన్‌స్పెక్షన్ చేసే అవకాశం ఉంది. నూతన కళాశాలల అధికార యంత్రాంగం నిరీక్షిస్తోంది. ఇన్‌స్పెక్షన్ అనంతరం ఎంఎన్‌సి చేసిన సిఫారసుల ఆధారంగా అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఆగస్టులోపు అడ్మిషన్లకు అనుమతి లభిస్తే సెప్టెంబర్‌లో తరగతుల నిర్వహించే అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పులివెందుల వైద్య కళాశాలలో 100, మదనపల్లి వైద్య కళాశాలలో 150 మంది చొప్పున అడ్మిషన్లు ఇచ్చే అవకాశం ఉందనే అంచనాతో ముందుకెళ్తుండడం గమనార్హం.

ఎన్ఎంసి సిఫారసు తప్పనిసరి

పులివెందుల, మదనపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల కార్యకలాపాల నిర్వహణకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలపాలి. ఎప్పుడైనా నూతన వైద్య కళాశాలలను ఇన్‌స్పెక్షన్ చేయడానికి వచ్చే అవకాశం ఉంది. వైద్యకళాశాల నిర్వహణ కార్యకలాపాలకు అనుగుణంగా వైద్య కళాశాలల్లో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

డాక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపల్, వైద్య కళాశాల, పులివెందుల.



నిర్మాణంలో ఉన్న మదనపల్లి మెడికల్ కళాశాల

కష్టజీవుల పక్షాన పోరాటం

వ్య.కా.స అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కష్టజీవుల పక్షాన నికరంగా పోరాటాలు చేస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన గురువారం అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 1934లో స్థాపించిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు కోటి మంది సభ్యులతో దేశవ్యాపితంగా విస్తరించిందని పేర్కొన్నారు. దేశంలో నేటికీ 65 శాతంపైగా ప్రజలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఆ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ఉద్దేశ్యంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్నదని, దానిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, గ్రామీణ ప్రజల జీవితాల మెరుగుదల కోసం వ్యవసాయ కార్మిక సంఘం అనేక ఉద్యమాలు, పోరాటలు చేస్తున్నదని గుర్తుచేశారు. రాబోయే కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాల రూపకల్పనకు హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగు తున్నాయని తెలిపారు. వ్యవసాయ కూలీలు సాధించుకున్న పథకాలు రక్షించుకోవాలని అందుకోసం ఐక్య ఉద్యమాలు నిర్వహిం చాలని తెలిపారు. తగిన వర్షాలు లేక, అనావృష్టి వలన విపత్తు వచ్చినప్పుడు పేదలను ఆదుకున్నది ఉపాధి హామీ పథకమేనని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజలను విస్మరించి మోసం చేస్తున్నాయని, మతోన్మాద బిజెపిని నెత్తిన ఎత్తుకొని ఊరేగుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల ఫలితాలలో ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేది లేదని పేదల కోసం, వ్యవసాయ కూలీల రక్షణ కోసం ఉద్యమాలు తప్పవని పేర్కొన్నారు. భూమి, ఉపాధి పరిరక్షణకై వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసి పరిష్క రించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు విక్రమ్‌సింగ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి.శ్రీనివాసులు, కె.రవి, కెవి. నారాయణ, ఆంజనేయులు, నాగే శ్వరరావు కోట కళ్యాణ్, పుల్లయ్య, సింహా చలం, ఓబుల రాజు పాల్గొన్నారు.



రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం

జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు జిల్లా కౌంటింగ్ కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి వి విజయ్‌రామరాజు పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, భద్రతా చర్యలు తదితర అంశాలపె రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారితోపాట జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, ఎఎస్‌పి సుధాకర్ హాజరయ్యారు. ముందుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ చెదురుమదురు సంఘటనలు మినహా అందరి సమిష్టి కృషితో ఈ నెల 13న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని అదే స్ఫూర్తితో జూన్ 4న జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకుని విజయవంతంగా నిర్వహించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆయన కోరారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటికీ కౌంటింగ్‌ను కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో మొత్తం 112 సిసి కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ అధికారులకు మొదటి ర్యాండమైజేషన్ ఈనెల 25న నిర్వహించనున్నామని, వారికి శిక్షణా కార్యక్రమాలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, నోడల్ అధికారులు పాల్గొన్నారు

అంబులెన్స్ డ్రైవర్లకు సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - కడప సిటీ

కడప అనస్థీషియాలజీ విభాగం ఆధ్వర్యంలో గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో కడపకు చెందిన 30 మంది అంబులెన్స్ డ్రైవర్లకు సిపిఆర్ (COLS & BCLS) అవగాహన శిక్షణను గురువారం నిర్వహించారు. డాక్టర్ బి.వి వరసుబ్రహ్మణ్యం డాక్టర్ శేషం సోను, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ రిజ్వాన్ శిక్షణ అందించారు. కార్యక్రమం అనంతరం అంబులెన్స్ డ్రైవర్లు శిక్షణతో కార్డియో అరెస్ట్ బాధితుల ప్రాణాలు బహిరంగ ప్రదేశాల్లో ఎదురైతే వారి ప్రాణాలను కాపాడేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో శిక్షణ పొందేలా ఇతరులను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయాన్ని అందించినందుకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవికి , అనస్థీషియాలజీ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.



డ్రైవర్‌కు శిక్షణ ఇస్తున్న అనస్థీయా విభాగం సిబ్బంది

ఆడపూరు బుద్ధ స్థూపాలపై పిక్ పోస్ట్‌కార్డులు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నందలూరు మండలం ఆడపూరు బుద్ధ స్థూపాలపై పిక్ పోస్ట్ కార్డును ఆవిష్కరించారు. గురువారం వైశాఖ బుద్ధ పూర్ణిమ సందర్భంగా ప్రధాన పోస్టర్ కార్యాలయంలో పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ ఆయన ఛాంబర్ అతిధుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, వీరారెడ్డి డిగ్రీ కాలేజీ అధ్యాపకులు సుబ్బరాయుడు, వివేకానంద మఠం చెన్నూరు బస్టాండ్ స్వామీజీ సన్నివాసానంద స్వామి, ఏఎస్పీలు విజయభాస్కర్, భాస్కర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్ట్‌కార్డులను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్

నేడు చాంద్‌పీర్ దర్గా ఉరుసు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రహమతుల్లా వీధిలో వెలసిన చారిత్రాత్మకమైన హజరత్ ఖ్వాజా బందా నవాజ్ సాహెబ్ రహమతుల్లా అలైహి వారి చాంద్ పీరా గుంబద్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నామని దర్గా ముతవల్లి అమీరున్నిసా ఒక ప్రకటనలో తెలిపారు. 24 రాత్రి గంధం దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుంచి ఫకీర్ల మేళ్ల తాళాలతో విన్యాసాలతో దర్గా వద్దకు చేరి గంధాన్ని సమర్పిస్తామని పేర్కొన్నారు. 25న ఉరుసు, 26 తహలీల్ కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఉరుసు, తహలీల్ రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ ఉంటాయని పేర్కొన్నారు. ఉరుసు రోజున రాత్రి బెల్గం నుంచి ప్రముఖ ఖవ్వల్ తౌసిఫ్ ఖాదిరి, కర్ణాటక నుంచి ప్రముఖ ఖవ్వల్ పైసల్ అలీ వారిస్, తహలీల్ రోజున రాత్రి ప్రముఖ ఖవ్వల్ మైసూర్ నుంచి నిజాం నవాజ్ ఖాదిరి, పైసల్ అలీ వారిస్ పాల్గొంటారని తెలిపారు. ముస్లిం సోదరులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

తాళ్లపాకలో వైభవంగా

శ్రీవారి కల్యాణం

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య

విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు గురువారం అన్నమయ్య జిల్లా తాళ్ళపాకలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తాళ్లపాకలోని ధ్యానమందిరం వద్ద ఉదయం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. విశాఖ శారద పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానం దేంద్రస్వామి స్వామీజీ పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒకరైన శ్రీ వేణుగోపాల్ దీక్షితుల ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. పుణ్యాహవచనం, పవిత్రహోమం, కంకణధారణ, మాంగళ్యధారణ, మంగళాశాసనం ఘట్టాలతో శ్రీవారి కల్యాణం నిర్వహించారు. చివరిగా నక్షత్ర హారతి, మంగళహారతి కార్యక్రమంతో కల్యాణం ముగిసింది. భక్తులకు టిటిడి మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు అందించింది. శ్రీవారి కల్యాణం అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామిస్వామీజీ అనుగ్ర హభాషణం చేస్తూ, భగవంతుని తత్వాన్ని తెలుసు కునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారన్నారు. 600 సంవత్సరాలకు పూర్వమే శ్రీవారి తత్వాన్ని, భక్తి, ప్రపత్తి, శరణాగతిని సామాన్యులకు అర్ధమ యమయ్యేలా చెప్పారన్నారు. భగవంతునిపై పూర్తి విశ్వాసంతో నామసంకీర్తనం చేస్తే ముక్తి కలుగు తుందని అన్నమయ్య కీర్తనల ద్వారా అవగతమవు తుందని వివరించారు. అంతకుముందు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉదయం 9 నుండి 10 గంటల వరకు సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన ఉదయభాస్కర్, హేమమాలిని సంగీత సభ, రాత్రి 7 గంటలకు తిరుపతికి చెందినశ్రీనివాస్ బృందం హరికథ గానం చేయనున్నారు. రాజంపేట-కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి ఊంజల్‌సేవ వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నారాయణస్వామి, నాగలక్ష్మీ బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించనున్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుపతికి చెందిన లక్ష్మీకుమారి బృందం హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నిత్యావసర సరుకులు పంపిణీ

కడప అర్బన్ : ప్రకాష్ నగర్‌లో నివసిస్తున్న ఒక మహిళ కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగాలేక కనీసం రోజు గడవాలన్నా చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిసి జెబివిఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి స్పందించి వారికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సేవ సమితి వ్యవస్థాపకుడు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్ మాట్లాడుతూ మనం చిన్నప్పటి నుంచి ఈ స్థాయికి రావడానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎంతోమంది సహాయ సహకారాలు అందించి ఉండాలని పేర్కొన్నారు. మన సాయం కోసం ఎందరో ఎదురు చూస్తూ ఉంటారని తెలిపారు. వారికి మనం వీలైనంత సాయం మనం చేయాలని చెప్పారు. కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన స్రవంతి రెడ్డి, సాయి రాజు, సతీష్ రెడ్డి, శ్రీనివాసులు, అరుల్దస్, శైలజకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శ్రీను, వినయ్ పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులకు అనుమతి లేదు

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రొద్దుటూరు పట్టణంలో పేస్ సంస్థకు ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించుటకు ఎలాంటి అనుమతి లేదని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇటువంటి గుర్తింపు లేని కళాశాలలో తమ పిల్లను చేర్పించవద్దని తెలిపారు. అలా చేర్పించినచో ఆర్ఐఒఆఫీస్ కానీ, ఇంటర్మీడియట్ విద్యా మండలి కానీ, బాధ్యత వహించదని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రయివేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ప్రవేశాలు తీసుకున్నట్లు, వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు, అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు అందితే జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి : సిఐటియు

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యార్థులకు లక్ష్యం ఉండాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. గురు వారం ఆర్‌కె నగర్‌లో నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక సమ్మర్ క్యాంపులో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో మంచి విద్యార్థులుగా ఎదగాలని పేర్కొన్నారు. రేపటి మంచి సమాజం కోసం శాస్త్రీయ దృక్పథాన్ని అల వర్చుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి నిర్వహిస్తున్నటువంటి ఇలాంటి సమ్మర్ క్యాంపులు చాలా ఉపయోగకరమైనవని చెప్పారు. ఇలాంటి క్యాంపులు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదికకు ధన్యవాదాలు పలుకుతున్నానని తెలిపారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం, ప్రజానాట్యమండలి నాయకులు డాక్టర్ చంద్ర ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరిలో మూఢాచారాలు అధికంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందరు చదవాలి అందరు ఎదగాలి, ఈ మూఢనమ్మకాలని నిర్మూలించాలని పిలుపునిచ్చారు. అనంతరం వెంకటేశ్వర్లు జిల్లా కమిటీ ట్రెజరర్ సమీర్ బాష కొన్ని మ్యాజిక్కులు చేసి చూపించారు. కెమికల్స్ గురించి, వాటి ప్రయోజనాల గురించి వెంకటేశ్వర్లు పిల్లలకు వివరించారు. ఐద్వా నాయకురాలు ఐఎన్ సుబ్బమ్మ పిల్లలకి మ్యాజిక్ పాట పాడి, బోర్డు మీద రాసి అలరింపచేశారు. సాంబయ్య రంగస్థల పద్యాలు పాడి పిల్లలను అలరింప చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మనోహర్

పిల్లల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలి

ప్రజాశక్తి - కడప

చిల్డ్రన్స్ హోమ్‌కు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించి పిల్లల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలి అని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. గురువారం కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో కడప ఎన్‌జిఒ కాలనీలోని సరస్వతి జూనియర్ కళాశాల పక్కన ఉన్న బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న బాసర చిల్డ్రన్ హోమ్‌కు రూ. 25 వేలు విలువ చేసే నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్ హోమ్‌కు అందరి సహకారం అవసరమని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు నిత్యం ఒత్తిడిలో విధులు నిర్వహిస్తూ సహాయక కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని వారు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని విద్యుత్ సేవా సంఘం వారికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం జనరల్ సెక్రెటరీ చలపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాయక్, లక్ష్మీపతి అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ బాసట చిల్డ్రన్స్ హోమ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్‌రెడ్డి

నగిరిగుట్టలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని నగిరిగుట్టలో పులివెందుల పట్టణ ఎస్ఐ అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం ఎస్పీ ఆదేశాల మేరకు నగిరిగుట్టలో అనుమానం ఉన్న ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జరగబోయే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ కూడా అవాంఛనీయ సంఘటనల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పోలీసుల ఆదేశాలను పాటించకుండా గొడవలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ బహిష్కరణ చేస్తారని ఎస్ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్

సమస్యలుంటే పోలీసుల దృష్టికి తేవాలి

లింగాల : సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని ఎస్ఐ కృష్ణయ్య యాదవ్ తెలిపారు. మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన అంబకపల్లి గ్రామంలో గురువారం లింగాల పోలీసులు నాకాబంది నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలోని ఫ్యాక్షన్ నాయకులు ఇళ్లు, కల్లాలు, పొలాలు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఎస్ఐ గ్రామ నాయకులతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగరాదన్నారు. జరిగితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

– ఎన్నికల కౌంటింగ్ ముగిసేవారకు ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో ఉండాలని పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ తెలిపారు గురువారం మండలంలోని కోమనూతల, గునకనపల్లి, మురారి చింతల, పెద్దకూడాల, లింగాల తదితర గ్రామాల్లో ఉండే రౌడీషీటర్లు, పలు హత్య కేసులో ఉన్న నిందితులకు పోలీస్‌స్టేషన్‌లో ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, అలాగే ఎన్నికల కౌంటింగ్ ముగిసేవరకు ప్రశాంతంగా ఉండలని, లేదంటే తీవ్ర పరిమాణాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల సిఐ మద్దిలేటి, ఎస్ఐ కృష్ణయ్య యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మొలకల పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సాయంత్రం మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున మొలక కుంపట్లు, ప్రత్యేకంగా అలంకరించిన గౌరీదేవి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా సింహాద్రిపురం, బలపనూరు, గూడూరు, కోరగుంటపల్లె, గురజాల తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు బ్యాండ్ మేళాల నడుమ నృత్యాలు చేసుకుంటూ, గ్రామోత్సవం చేశారు.

శివపురం గంగమ్మ తిరుణాల వాయిదా

ప్రజాశక్తి - మైదుకూరు

మండల పరిధిలోని శివపురంలో ఈ నెల 25 నుంచి జరగాల్సిన గ్రామ దేవత గంగమ్మ తిరుణాలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ప్రకటించారు. తిరుణాలను జూన్ నెలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని భక్తులతోపాటు బండ లాగుడు పోటీలకు వచ్చే ఎడ్ల యజమానులు గమనించాలని వారు కోరారు.

సహకార సంఘం బ్యాంకులో ఆధార్ కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకులో సభ్యులు తమ ఆధార్ కార్డును ఫోన్ నెంబర్‌తో కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని బ్యాంకు సిఇఒ జాన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణ చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ప్రతి సభ్యుడు అప్డేట్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు మంజూరు కావన్నారు. సహకార సంఘం ఎన్నికలు జరిగినప్పుడు ఓటు హక్కును కోల్పోతారన్నారు. రుణాలపై ఇచ్చే వడ్డీ మాఫీకి కూడా అనర్హులవుతారని తెలిపారు. పంట నష్ట పరిహారం అందదని సూచించారు. ప్రతి రైతు కెవైసి తప్పక చేయించుకోవాలని జాన్ కోరారు.

వైఎస్ రాజారెడ్డికి ఘన నివాళులు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్



రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి 26వ వర్ధంతి వేడుకలను గురువారం పులివెందులలో వైసిపి నాయకులు ఘనం గా నిర్వహించారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ అఫీస్, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున రాజారెడ్డికి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పులివెందుల పంచాయితీకి అప్పట్లో వైఎస్ రాజారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. వైఎస్ కుటుంబ సభ్యులు శ్మశాన వాటికలో రాజారెడ్డి సమాధిపై పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

అధ్వానం.. రాజకోట రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు – ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుండి మండల పరిధిలోని రాజకోట గ్రామానికి వేసిన తారు రోడ్డు రెండేళ్లు కాకుండానే అధ్వానంగా తయారైంది. ఏటూరు కేసీ కెనాల్ వెంబడి ఎన్నో ఏళ్లుగా గ్రావెల్ రోడ్‌పై ప్రయాణం సాగిస్తున్న గ్రామస్తుల అభ్యర్థన మేరకు గత ప్రభుత్వ హయాంలో రోడ్డును ఉపాధి హామీ అనుసంధానంతో తారు రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఏమాత్రం పాటించకపోవడంతో రెండవ ఏడాది తిరగకుండానే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. తారు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గ్రావెల్ బయట పడింది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో రోడ్డు నిర్మాణ పనులను సరిగ్గా పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు పరిస్థితి ఈ విధంగా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ.30 లక్షలకుపైగా ఖర్చు చేసి నిర్మించిన రోడ్డు ఏడాది కూడా నిలువలేకపోయింది. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరు తున్నారు. ఈ మార్గాన రాజకోటాలుతోపాటు విజయనగరం, ఓబుల్‌రెడ్డి పేట, గాంధీనగరం గ్రామ ప్రజలు మైదుకూరు,చాపాడు, ప్రొద్దుటూరు పట్టణాలకు రావాల్సి ఉంటుంది. ఎలాంటి వాహనాలు కూడా ఈ మార్గాన ప్రయాణానికి అందుబాటులో ఉండవు. ప్రజలు స్వచ్ఛందంగా ఆటోలను, ద్విచక్రవాహనాన్ని కలిగి ఉండి ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ మార్గం అధ్వానంగా ఉండడంతో ఆటోల వారు అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత గ్రామప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




దెబ్బతిన్న తారు రోడ్డు

ఉజ్వల భవిష్యత్తుకు 'శ్రీ పద్మావతి హైస్కూల్'

నైతిక విలువలు, ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన : కరస్పాండెంట్ ఎన్.చంద్ర ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చక్కటి పాఠశాల శ్రీ పద్మావతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్. నైతిక విలువలతో ఆహ్లాదకర వాతావరణంలో విద్యా బోధన సాగుతుందని ఆ పాఠశాల కరస్పాండెంట్, ప్రధానో పాధ్యాయులు ఎన్.చంద్రఓబులరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు చరిత్రలోనే 592 మార్కులు సాధించిన విద్యాసంస్థ తమ పాఠశాలే అన్నారు. 2006లో శ్రీనారాపుర వెంకటేశ్వర స్వామి దేవాలయం పక్కన శ్రీనగర్ వీధిలో శ్రీపద్మావని హైస్కూల్‌ను ప్రారంభించామన్నారు. నాటి నుంచి నేటి వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీపడడంలేదన్నారు. విద్యతోపాటు చక్కటి సంస్కారం, క్రమశిక్షణ, పెద్దలపట్ల ఎలా మెలగాలనే నైతిక విలు వలు బోధిస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసు కొని 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్న ఏకైక పాఠశాల శ్రీ పద్మావతి హైస్కూల్ అన్నారు. అనుభవం గల ఉపాధ్యాయులు, ప్రొజెక్టర్ల ద్వారా విద్య, సైన్స్ ల్యాబ్ ద్వారా బోధన చేస్తున్నామన్నారు. నీట్, ఐఐటి ఫౌండేషన్ కోర్సులకు అత్యుత్తమ ప్రతిభగల ఉపాధ్యాయులతో బోధిస్తున్నామన్నారు. దూర విద్యార్థులకు వ్యాన్ లేదా బస్ సౌకర్యం కూడా ఉందన్నారు. 2023-24 విద్యా సంవ త్సరంలో 592 మార్కులతో యం.జెశ్విక శరణ్య పట్టణంలో రెండవ స్థానంలో నిలిచిం దన్నారు. 582 మార్కులతో పి.వెంకట కుమార్ తోపాటు 550పైన 10 మంది, 500పైన 25 మంది విద్యార్థులు ఉన్నార న్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావ రణంతోపాటు చక్కటి ఆటస్థలం ఉందన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌పై శ్రద్ధ, పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలు రేకెత్తేలా చక్కటి రైటింగ్ నేర్పించడంలో ముందుం టామన్నారు. అడ్మిషన్లు, పూర్తి వివరాలకు 93460 03747 నంబర్‌ను సంప్రదించాలన్నారు.



ఎన్.చంద్ర ఓబులరెడ్డి



పాలిటెక్నిక్‌తో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

పాలిసెట్-24 కౌన్సెలింగ్‌పై విద్యార్థులకు ఉచిత అవగాహన : ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి

ప్రజాశక్తి - మైదుకూరు



మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈ విద్యా సంవత్సరంలో సివిల్, మెకానికల్, ఇఇఇ, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఐటి, కెమికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లకు అనుమతి లభించిందని ప్రిన్సిపల్ పి.గురుమూర్తి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లమా పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థల్లో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. తమ కళాశాలలో చేరితే ఉచిత హాస్టల్ వసతి ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉంటుం దన్నారు. మూడేళ్ల డిప్లమా కోర్స్ పూర్తయిన తర్వాత కూడా బీటెక్‌లో చేరడానికి ఇసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలకు, ప్రాంగణ ఎంపికలకు కూడా తోడ్పాటు ఉంటుం దన్నారు. పాలిసెట్-24 ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కాకపోయినా, పాలిసెట్ రాయకపోయినా కూడా నేరుగా ఏ బ్రాంచ్‌లోనైనా తమ కళాశాలలో ప్రవేశం కల్పిస్తామన్నారు.

పాలిసెట్-24 కౌన్సెలింగ్ అభ్యర్థులకు ఉచిత అవగాహన

పాలిసెట్-24 మొదటి విడత కౌన్సెలింగ్‌కు ప్రకటన వెలువడింది. ఈనెల 27నుంచి జూన్ 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగును. పాలిసెట్-24 కౌన్సెలింగ్ అభ్యర్థులకు మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత అవగాహన కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.గురుమూర్తిరెడ్డి తెలిపారు. అడ్మిషన్ పూర్తయ్యేవరకు తమ సహాయ సహకారాలు అంది స్తామన్నారు. వివరాలకు మైదుకూరు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా లేదా మొబైల్ నెంబర్ 93474 10521ను సంప్రదించవచ్చునని తెలిపారు.

ఉద్యోగం పొందిన విద్యార్థులకు అభినందనలు

సింహాద్రిపురం : పాలిటెక్నిక్ విద్య అభ్యసించిన విద్యార్థికి ఉన్నతావకాశాలు ఉన్నాయని నిడివెలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తాతాజీ పేర్కొన్నారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో పలు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు సాధించిన 16 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థి నిడివెలగల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్ని కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు. పాలిటెక్నిక్ చేసిన అనతి కాలంలోనే ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని, ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ తాతాజీ

వేసవిలో చింతచిగురుకు భలే గిరాకీ



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆకులు రాలి చింత చిగురు కోతకు రావడంతో దానికి మంచి గిరాకీ ఉంది. ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి నుంచి మే నెలాఖరుదాకా చింత చెట్లలో చిగురు వస్తుంది. గ్రామాల్లో ఎక్కువగా దీన్ని వినియోగించుకునే వారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా చింతచిగురుకు మంచి క్రేజ్ పెరిగింది. సీజన్‌లో లభించే చింతచిగురుతో పప్పు, చారు తదితర వంటలు చేసుకుంటారు. నోరు ఊరూరించేలా చేసుకొని తినవచ్చు. గ్రామాల్లో అధికంగా చింతచెట్లు కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇవి అందుబాటులో లేవు. తలుపుల, కొత్తపల్లి, యన్‌పి కుంట తదితర ప్రాంతాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నుంచి చింతచిగురు పట్టణాల్లోని మార్కెట్లోకి వస్తోంది. చింతచెట్లు ఆకురాలిపోయి చిగురొచ్చింది. పలువురు చింతచిగురు పప్పు, చారును లొట్టలేసుకుని తింటుంటారు. దీంతో లేత చిగురు కోసం చింతచెట్ల వద్ద జనం కనిపిస్తున్నారు. చింతచెట్లకు ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడరు. అంతేకాకుండా చింతచిగురులో సీ విటమిన్ పుష్కలంగా ఉంటుందని వైద్యులు చెపుతున్నారు. చింత చిగురులో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉంటాయని న్యూట్రిషియన్లు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు ఉంటాయన్నారు. ప్రతి వంద గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.6 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లిగ్రాముల కాల్షియం, 140 మి.గ్రా.ల ఫాస్ఫరస్, 26 మి.గ్రా.ల మెగ్నీషియం, విటమిన్-సి 3 మి.గ్రా.లు ఉంటుందని చెప్పారు. యాంటీ బాక్టీరియా వల్ల ఇన్ఫెక్షన్ తగ్గిస్తుందని యాంటీ డయాబెటిక్ లక్షణాలుండడం వల్ల మధుమేహం ఉన్న వారికి మేలు చేస్తుందని అన్నారు. కాలేయాన్ని రక్షించడంతోపాటు.. జీర్ణక్రియను, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. మనిషిలో నష్టపోయిన కణజాలాన్ని సరిచేస్తుంది. శరీరంలో కొల్లాజైన్ నిర్మాణం, ఐరన్ సంగ్రహణం, గాయాలు మానిపోయేలా చేస్తుంది. ముఖ్యంగా ఎముకలు, దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. చింత చిగురు, లేతవంకాయలు వేసి చారుకాచి రాగి సంగటితో కలిపి వడ్డిస్తే.. అబ్బో ఊహిస్తేనే నోట్లో నీళ్లురుతాయి. చింతచిగురు సీజన్ ఇక నెల రోజులు మాత్రమే ఉంటుంది. అందుకే ఈ సీజన్లో దొరికే చిగురు కోసం పట్టణ వాసులు ఆసక్తిని చూపుతారు. ఎండాకాలంలో బాడీ కూలింగ్ (శరీరం చల్లబడుట) అవడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. కొందరు చింతచిగురులో ఉప్పు వేసుకుని రాయితో దంచుకుని తింటారు కూడా. పల్లెలో పిల్లలు వేసవి సెలవుల్లో ఊరి బయటకు వెళ్లి అక్కడున్న చింతచెట్లు ఎక్కి చిగురును కోస్తారు. వారు అక్కడే దంచుకుని తిని, కొంత ఇంటికి తెస్తారు. అలాగే పలువురు మహిళలు పప్పులో చింతాకు వేసేందుకు చెట్ల వద్దకెళ్లి కోసుకురావడం పల్లెల్లో పరిపాటి.

చింతచిగురు సేకరించడం కష్టం

చింత చెట్టు నుండి చింతచిగురు సేకరించడానికి ఎక్కువ మంది కూలీలు అవసరం. ఖర్చు కూడా పెరుగుతుంది. అంతేకాకుండా రోడ్ల విస్తరణతో చింత చెట్లు తొలగించారు. చింతచెట్లు పెంచడం తగ్గిపోవడంతో చింతచిరుగు దొరకడం కష్టమైంది. ఈ పరిస్థితుల్లో ధరలు పెంచాల్సి వస్తుంది.

– పుల్లమ్మ, చింతచిగురు వ్యాపారి

గతేడాది రూ.10కే చింతచిగురు

గతంలో రూ.10 ఇస్తే పప్పు కూరకు సరిపోయినంత చింతచిగురు వచ్చేది. చింతచెట్ల సంఖ్య తగ్గడంతో ధరలు పెంచారు. ప్రస్తుతం రూ.20 పెట్టాల్సి వస్తుంది.

– చింతలమ్మ, గృహిణి, పులివెందుల



అన్నమయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎన్.తులసిరెడ్డి

అన్నమయ్య గొప్ప సంఘ సంస్కర్త

ప్రజాశక్తి - వేంపల్లె

తాళ్లపాక అన్నమాచార్యులు పదకవితా పితామహుడు, తెలుగు తొలి వాగ్గేయకారుడు మాత్రమే కాదు.. గొప్ప సంఘ సంస్కర్త అని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అన్నమయ్య 616వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ రాజారామ్మోహన్‌రాయ్, వీరేశలింగం పంతులు, ఈశ్వర చంద్ర విద్యా సాగర్ వంటి గొప్ప సంఘ సంస్కర్తల కంటే ముందే తన సంకీర్తనల ద్వారా సమాజంలోని మూఢనమ్మకాలు, మూఢాచారాలను నిర్మూలించేందుకు అన్నమయ్య కృషి చేశారన్నారు. అన్నమయ్య కలియుగదైవం శ్రీవెంకటేశ్వర స్వామి భక్తుడు అన్నారు. ఆయన పేరున అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేయడం ముదావహం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, బద్రినాథ్, శివ, రవి, మదార్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వైమానిక దళ విశ్రాంత అధికారి వెంకట కొండయ్య

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వైమానిక దళ విశ్రాంత అధికారి వెంకట కొండయ్య పేర్కొన్నారు. గురువారం పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు పొద్దుటూరు బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట కొండయ్య మాట్లాడుతూ గ్రంథాలయాల వల్ల విద్యార్థులు ఎంతో విజ్ఞానం సంపాదించుకోవచ్చు అన్నారు. గ్రంథాలయాలు విద్యార్థుల ఉన్నతస్థాయికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు మెదడుకు మేత లాంటి అవగాహన కలిగించే ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. అనంతరం దేశభక్తి గీతాలు పాడించారు. కార్యక్రమంలోగ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రం సాహెబ్, రెహ్మాన్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

బిసిజి టీకా తప్పక వేయించుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బిసిజి టీకా వేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో నిర్వహించిన బిసిజి టీకాల కార్యక్రమాన్ని నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన అందరూ వ్యాక్సిన్‌కు అర్హులన్నారు. మొదటి విడతగా 60 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. వృద్ధుల్లో ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల క్షయ వ్యాధిని అరికట్టవచ్చనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్ఐవి, టిబి వ్యాధి ఉండి మాత్రలు తీసుకుంటున్న వారికి, కదల్లేక బెడ్‌పై ఉన్న రోగులకు వేయకూడదన్నారు. చక్కరవ్యాధి, అధిక రక్తపోటు వారికి ఈ వ్యాక్సిన్ వేయవచ్చని తెలిపారు. ఈ విషయాలను గుర్తుపెట్టుకొని అర్హుల జాబితాను సిద్ధం చేసుకున్న మేర అందరికీ ప్రతి గురువారం నిర్దేశించిన ప్రాంతాల్లో వ్యాక్సిన్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాళ్లపల్లె వైద్యాధికారి డాక్టర్ ఎన్ఆర్ స్వాతిసాయి, డాక్టర్ ఎస్ ఖాజాముద్దీన్, ప్రసాద్, సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, అరుణాదేవి, ఎంఎల్‌పిహెచ్ఒ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పూల అంగళ్ల నుంచి వైఎస్ఆర్ జంక్షన్ వరకు వన్‌వే

పులివెందుల రూరల్ : ఈనెల 27 నుంచి స్థానిక పూలఅంగళ్ల నుంచి పాత ఆర్‌టిసి బస్టాండ్ వైఎస్ఆర్ జంక్షన్ వరకు వన్ వే అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ట్రాఫిక్ సిఐ, ఎస్ఐ, ఆర్‌టిసి డిపో మేనేజర్, పలు సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన్ వే అమలుకు వాహనదారులందరూ సహకరించాలన్నారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న తాత్కాలిక ఆక్రమణలను దుకాణాల యజమానులే తొలగించుకోవాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే వాహనాల పార్కింగ్ చేసుకోవాలన్నారు. వ్యాపారులు ఏదేని వాణిజ్య సరుకు రవాణాను రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల్లోగా అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముద్దనూరు : కడప-తాడిపత్రి రైలు మార్గంలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో ఉన్న పట్టాలపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారామిరెడ్డి తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ప్రకారం.. ముద్దనూరు- కొండాపురం వెళ్లే రైలు మార్గంలో ఓబుళాపురం గ్రామం వద్ద ఉన్న రైలు పట్టాలపై గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. మృతుడు మాసిపోయిన పాత దుస్తులు ధరించి ఉన్నాడు. మృతదేహం రైలు పట్టాల మధ్యలో పడడంతో 3 గంటల పాటు రైళ్లు నిలిచి పోయాయి. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.